నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, శుక్రవారం 12 జనవరి 2024 | YADADRI BHUVANAGIRI

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జనవరి 11 : జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచి పనులు పెండింగ్ లేకుండా చూడాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ నిధులతో మంజూరైన పనుల పురోగతిపై పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పనుల్లో జాప్యం జరుగకుండా నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నిరాటోత్సవంలో భాగంగా మాఢ వీధుల్లో ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

## లక్ష్మీనరసింహుడికి వైభవంగా తిరు కల్యాణోత్సవం

యాదగిరిగుట్ట, జనవరి11: యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామి నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. గురువారం ఉదయం ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవ మూర్తులను ద్వివ మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని వీక్షించారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులకు సువర్ణ పుష్పార్చన జరిపించారు. సాయంత్రం వేళ తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి వేళ తిరువరాధన చేపట్టి, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామివారికి సహస్రనామార్చన నిర్వహించారు.

### కొనసాగుతున్న నిరాటోత్సవం..

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గోదాదేవి (ఆండాళ్) అమ్మవారికి నిరాటోత్సవం వైభవంగా నిర్వహించారు. రెండో రోజు భాగంగా స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించి వేడుకలు జరిపారు. గోదాదేవికి మహిళా భక్తులు మంగళహారతులతో నీరాజనాలు పలుకగా ఆలయ అర్చక బృందం, పారాయణికులు వేద మంత్రాలను పటిస్తూ తిరుప్పావై పూజలు చేశారు. నిరాటోత్సవంలో భాగంగా ఈ నెల 14న రాత్రి 7.00 గంటలకు ప్రధానాలయంలో గోదా కల్యాణం, 15న ఉదయం11.30 గంటలకు ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.


### మార్చి 11న లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి 2024 –వార్షిక క్యాలెండర్‌ను దేవస్థానం విడుదల చేసింది. ఈ సందర్భంగా అందులోని ఉత్సవాలు విశేషాలు ఇవి. ఆలయ బ్రహ్మోత్సవాలు మార్చి 11న స్వస్తివాచనంతో ప్రారంభమై 21న శతఘటాభిషేకంతో పరిపూర్ణం కానున్నాయి. పదకొండు రోజులపాటు సాగే వేడులు జరుగనున్నాయి. అనుబంధ పాతగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 19న ప్రారంభమై 25వ తేదీ వరకు కొనసాగనున్నాయి. అంతకుముందు పాతగుట్ట స్వామివారి అధ్యయనోత్సవాలు ఫిబ్రవరి 15 నుంచి 18 వరకు నిర్వహించనున్నారు. ప్రధానాలయంలో లక్ష్మీనృసింహ స్వామి జయంత్యుత్సవాలు మే 20 నుంచి 22వ తేదీ వరకు చేపట్టనున్నారు. అనుబంధ పర్వత వర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రోత్సవాలు మార్చి 5 నుంచి 10 వరకు నిర్వహించనున్నారు.

# లోక్‌సభ పోరుకు సమాయత్తం

## నేడు హైదరాబాద్‌కు గులాబీ సేన

- భువనగిరి పార్లమెంట్ స్థానంపై సమీక్ష
- దిశా నిర్దేశం చేయనున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- హాజరుకానున్న ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు
- 16న నల్లగొండ లోక్‌సభ స్థానంపై రివ్యూ






**త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికలపై బీఆర్‌ఎస్ దృష్టి సారించింది. నియోజకవర్గాల వారీగా నేతలు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేస్తూ సమాయత్తమవుతున్నది. అందులో భాగంగా శుక్రవారం భువనగిరి పార్లమెంట్ స్థానంపైన, సంక్రాంతి తర్వాత 16న నల్లగొండ స్థానంపైన సమీక్షకు సిద్ధమైంది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వేదికగా జరిగే సమీక్షల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై నియోజకవర్గాల వారీగా సమీక్ష చేస్తూ లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపైనే ప్రధానంగా చర్చించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. నేటి సమీక్ష సమావేశానికి భువనగిరి లోక్‌సభ పరిధిలోని ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులంతా హాజరుకానున్నారు.**

నల్లగొండ ప్రతినిధి, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల ఫలితాల్లోని లోటుపాట్లపై విశ్లేషిస్తూనే లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీగా సిద్ధం కావడానికి బీఆర్‌ఎస్ సమాయత్తమవుతున్నది. ఉమ్మడి జిల్లా పరిధిలో భువనగిరి, నల్లగొండ లోక్‌సభ స్థానాలు ఉన్న విషయం తెలిసిందే. ఈ నియోజకవర్గాల వారీగా శుక్రవారం భువనగిరి, 16న నల్లగొండ స్థానాల వారీగా ముఖ్యనేతలతో సమావేశాలకు షెడ్యూల్ ప్రకటించింది. అందులో భాగంగానే నేడు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో భువనగిరి లోక్‌సభ స్థానంపై సమీక్షా సమావేశం జరుగనున్నది.

### హాజరుకానున్న నేతలు

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం జరిగే భువనగిరి లోక్‌సభ స్థానంపై సమీక్షా సమావేశానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానుండగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్‌లతోపాటు లోక్‌సభ స్థానం పరిధిలోని జిల్లా పార్టీల అధ్యక్షులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, రాష్ట్ర, జిల్లా కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ రాష్ట్ర, జిల్లా నేతలు, ఇతర ముఖ్యులు పాల్గొననున్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సగటును 100 మంది చొప్పున మొత్తం ఏడు స్థానాల నుంచి 700 మంది వరకు హాజరుకానున్నారు. వీరందరికి యువనేత కేటీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. భువనగిరి లోక్‌సభ స్థానం పరిధిలో భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం, జనగామ అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇందులో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం జనగామలో మాత్రమే బీఆర్‌ఎస్ పార్టీ గెలుపొందింది. మిగతా ఆరు చోట్ల కాంగ్రెస్ పార్టీ గెలిచింది. ఇక ఇదే సమయంలో 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరిలో స్వల్ప తేడాతో కాంగ్రెస్ గెలుపొందింది. అయినా సరే భువనగిరి లోక్‌సభ స్థానంపైన ఈ సారి గులాబీ జెండా ఎగురవేయాలన్న లక్ష్యంతో ఎన్నికలకు సిద్ధం కానున్నది. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం అంతటా బలమైన పార్టీ యంత్రాంగం ఉంది. గత ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిషలు కష్టపడ్డారు. ప్రజల్లో కనిపించిన మార్పు సంకేతంతో అనూహ్య ఫలితాలు చవిచూడాల్సి వచ్చింది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన వ్యతిరేక ఫలితాలపై సమీక్షిస్తూ లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేసేలా దిశానిర్దేశం చేయనున్నారు.

### 16న నల్లగొండ పై..

సంక్రాంతి అనంతరం ఈ నెల 16వ తేదీన నల్లగొండ లోక్‌సభ స్థానంపైన తెలంగాణ భవన్‌లో సమీక్షా సమావేశం జరుగనున్నది. ఇందులోనూ భువనగిరి తరహాలోనే ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలంతా పాల్గొననున్నారు. నల్లగొండ లోక్‌సభ స్థానం పరిధిలో నల్లగొండ, దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇందులో సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డి మినహా మిగతా పార్టీ అభ్యర్థులంతా ఓటమి పాలయ్యారు. ఓటమిపై పార్టీ పరంగా జరిగిన లోటుపాట్లను చర్చిస్తూనే నల్లగొండ లోక్‌సభ స్థానంలో గెలుపుపై దృష్టి సారించనున్నారు. అందుకు అనుగుణంగా ఎన్నికలపై వ్యూహరచన చేయనున్నారు.

# పండుగ ప్రయాణం సాఫీగా సాగేలా..

- సంక్రాంతి వేళ హైవేపై ఏర్పాట్లు
- పంతంగి టోల్‌ప్లాజా వద్ద ప్రత్యేక చర్యలు
- ప్రతి 20 కిలోమీటర్లకు ఒక క్రేన్.. 30 కిలోమీటర్లకు అంబులెన్స్
- ఫాస్టాగ్ లేకుంటే ట్రాఫిక్ ఇక్కట్లు




పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

చౌటుప్పల్, జనవరి 11 : సంక్రాంతి పండుగ నేపథ్యంలో 65వ నంబర్ జాతీయ రహదారి రద్దీగా మారనున్నది. ఈ నెల 12 నుంచి 17 వరకు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించడంతో హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్లేందుకు ఉమ్మడి జిల్లావాసులతోపాటు, ఏపీ ప్రజలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో చౌటుప్పల్ పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫాస్టాగ్‌ను తప్పనిసరి చేస్తూ సూచనలిస్తున్నారు. ఫాస్టాగ్ ఉంటే అర నిమిషంలో టోల్‌ప్లాజా దాటవచ్చు.. లేదంటే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవాల్సిందే.. ఫాస్టాగ్ లేకున్నా, పని చేయకున్నా టోల్‌ప్లాజా వద్ద రెట్టింపు రుసుము చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. కావున వాహనదారులు ముందే ఫాస్టాగ్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ఫాస్టాగ్ లేని వారి కోసం నగదు చెల్లింపు కోసం ప్రత్యేక కౌంటర్ ఉంటుందని, ఇక్కడ నాలుగైదు నిమిషాల సమయం పడుతుందని తెలిపారు.

### ట్రాఫిక్ నియంత్రణకు..

చౌటుప్పల్ మండల వ్యాప్తంగా ట్రాఫిక్ నివారించేందుకు ఇద్దరు ట్రాఫిక్ సీఐలు, ముగ్గురు ట్రాఫిక్ ఎస్‌ఐలు, 30మంది ట్రాఫిక్ సిబ్బందిని కేటాయించారు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద ట్రాఫిక్ నియంత్రణకు జీఎమ్మార్ 30 మంది ఆదనపు సిబ్బందిని నియమించింది. వారు టోల్‌ప్లాజాతోపాటు చౌటుప్పల్ మండల పరిధిలోని దండు మైలారం, దండు మల్కాపురం, ఖైతాపురం, ధర్మోజిగూడెం, అంకిరెడ్డిగూడెం, పంతంగి, గుండ్లబావి క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. ఏదైనా ప్రమాదం జరిగితే రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా ప్రతి 20 కిలోమీటర్లకు ఒక క్రేన్, 30 కిలోమీటర్లకు ఒక అంబులెన్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులకు ఏదైనా ఇబ్బంది ఉంటే 100లేదా వాట్సాప్ నంబర్ 8712662111ను సంప్రదించాలని భువనగిరి ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. వాహనదారులకు ఏ సమస్య ఉన్నా 1033 నంబర్‌ను సంప్రదించాలని జీఎంఆర్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.



భువనగిరి బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

## ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- **నేటి నుంచి ఈ నెల 15 వరకు సంక్రాంతి సర్వీసులు**
- **నల్లగొండ రీజియన్ పరిధిలో 400 బస్సుల ఏర్పాటు**

నల్లగొండ సిటీ, జనవరి11 : సంక్రాంతికి వివిధ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వచ్చే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపించేందుకు ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి నల్లగొండలోని ఏడు డిపోల నుంచి 400 బస్సులను వివిధ ప్రాంతాలకు తిప్పేందుకు సిద్ధం చేసింది. నేటి నుంచి ఈ నెల 15 వరకు ఇవి అందుబాటులో ఉండనున్నాయి. హైదరాబాద్ నుంచి అధిక రద్దీ ఉండనున్నందున ఆ మార్గానికి ఎక్కువ సర్వీసులు కేటాయించారు. ప్రధానంగా ఈ నెల 12, 13, 14 తేదీల్లో రద్దీ ఎక్కువగా ఉంటుందని, దానికి అనుగుణంగా బస్సులు నడిచేలా ప్రణాళికలు రూపొందించామని నల్లగొండ రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు.

### మహాలక్ష్మి పథకంతో పెరుగనున్న రద్దీ

ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద ఇటీవల ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. దాంతో పండుగకు మహిళా ప్రయాణికుల సంఖ్య పెరుగనున్నది. సాధారణ రోజుల్లోనూ రద్దీ ఉంటుండడగా పండుగకు ప్రయాణం కొంత కష్టమే. దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నదని, జాగ్రత్తగా ప్రయాణాలు సాగించాలని అధికారులు సూచిస్తున్నారు.



అవిశ్వాస సమావేశం ఫారం – 2 నోటీసు తీసుకుంటున్న ఆలేరు కౌన్సిలర్లు

# 'అవిశ్వాస' రాజకీయం

## బీఆర్‌ఎస్ నేతలను పదవులను తొలగించే కుయుక్తులు

## మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలపై అవిశ్వాస తీర్మానాలు

- ఇటీవల కలెక్టర్, ఆర్డీఓకు సభ్యుల లేఖలు అందజేత
- 23న భువనగిరి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసానికి నోటీసులు
- 27న ఆలేరు చైర్మన్, రామన్నపేట ఎంపీపీపై కూడా..
- ప్రలోభాలు, క్యాంప్ రాజకీయాలకు కాంగ్రెస్ తెర

యాదాద్రి భువనగిరి, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులను పదవుల నుంచి తొలగించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ కుయుక్తులు పన్నుతున్నది. మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలను దింపేందుకు అడ్డదారులు తొక్కుతున్నది. ఇప్పటికే కలెక్టర్, ఆర్డీఓలకు లేఖలు రాశారు. ఈ నెల 23న భువనగిరి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు ఇటీవల కలెక్టర్ నోటీసు ఇవ్వగా, ఆలేరు మున్సిపల్ చైర్మన్‌గా అవిశ్వాసానికి గురువారం నోటీసులు అందించారు. అదే విధంగా 27న రామన్నపేట ఎంపీపీపై కూడా అవిశ్వాసం పెట్టనున్నారు.

జిల్లాలో ఆరు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆరు మున్సిపాలిటీలను సైతం బీఆర్‌ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. అన్ని చోట్లా బీఆర్‌ఎస్ కౌన్సిలర్లే చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లుగా కొనసాగుతూ వచ్చారు. ఇటీవల ఎన్నికల ముందు యాదగిరిగుట్ట, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం భువనగిరి, ఆలేరు, పోచంపల్లి, మోత్కూరు మున్సిపాలిటీలకు బీఆర్‌ఎస్ మున్సిపల్ చైర్మన్లు ఉన్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు లేకుండా చేయాలని దుర్బుద్ధికి దిగింది. మరికొన్ని నెలల్లోనే మున్సిపల్ ఎన్నికలు ఉన్నప్పటికీ, తక్కువ కాలం ఉన్నా నేతలు తొలగించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా అవిశ్వాస తీర్మానాలు పెట్టాలని లేఖలు అందించేలా ప్లాన్ చేసి ముందుకెళ్తున్నారు.

### రామన్నపేట ఎంపీపీపై కూడా..

మున్సిపల్ చైర్మన్లతోపాటు ఎంపీపీలపైనా కాంగ్రెస్ కుతంత్రాలను చేస్తున్నది. రామన్నపేట ఎంపీపీ కన్నెబోయిన జ్యోతిని తన పదవి నుంచి దించేందుకు ప్లాన్ చేసింది. ఎంపీపీకి వ్యతిరేకంగా సభ్యులు లేఖ అందించగా, ఈ నెల 27న అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఆర్డీఓ నోటీసులు జారీ చేశారు. రామన్నపేట మండలంలో మొత్తం 15 మంది ఎంపీటీసీ ఉన్నారు. ఇందులో ఆరుగురు బీఆర్‌ఎస్, ఐదుగురు కాంగ్రెస్, ముగ్గురు సీపీఎం, ఇద్దరు ఇండిపెండెంట్ సభ్యులు గెలిచారు.

### ప్రలోభాలు.. క్యాంప్ రాజకీయాలు...

ఎలాగైనా బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులను పడగొట్టేందుకు కాంగ్రెస్ అన్ని అస్త్రాలను ఉపయోగిస్తున్నది. బీఆర్‌ఎస్ సభ్యులను తమ దారికి తెచ్చుకునేందుకు అడ్డదారులను తొక్కుతున్నది. డబ్బులు, ప్యాకేజీ ఆశ చూపున్నారనే చర్చ జోరుగా సాగుతున్నది. కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నది. క్యాంప్ రాజకీయాలకు తెరలేపుతున్నది. ఇటీవల ఈ తరహా రాజకీయం భువనగిరి మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. చైర్మన్ పదవికి మద్దతిస్తే ఓ రేటు, వైస్ చైర్మన్ పదవికి మద్దతిస్తే మరో రేటు అని జోరుగా ప్రచారం జరుగుతున్నది.

### 23న భువనగిరి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం

భువనగిరి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని సభ్యులు లేఖ ఇచ్చారు. దాంతో ఈ నెల 27న తీర్మానం పెట్టేందుకు కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. మున్సిపాలిటీలో మొత్తం 35మంది సభ్యులు ఉండగా, ఇందులో 15మంది బీఆర్‌ఎస్, 11 కాంగ్రెస్, 7 బీజేపీ, ఇద్దరు ఇండిపెండెంట్లు గెలిచారు. ఎక్స్ అఫిషియో మెంబర్లు అయిన పైళ్ల శేఖర్ రెడ్డి, ఎలిమినేటి కృష్ణారెడ్డి, ఇద్దరు ఇండిపెండెట్లతో బీఆర్‌ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకున్నది. ఇటీవల 31మంది సభ్యులు కలిసి అవిశ్వాసం పెట్టాలని కలెక్టర్‌ను కలిసి లేఖ అందించారు. దీంతో ఈ నెల 23న అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కలెక్టర్ సభ్యులకు నోటీసులు జారీ చేశారు. కాగా మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులుపై కనీసం ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేకున్నా ఉద్దేశపూర్వకంగా అవిశ్వాసానికి ఒడిగట్టడంపై సర్వత్రా చర్చించుకుంటున్నారు.

### 27న ఆలేరు..

భువనగిరి అవిశ్వాసానికి కలెక్టర్ నోటీసులు ఇవ్వడంతో ఆలేరులో సైతం చైర్మన్, వైస్ చైర్మన్‌ను పడగొట్టేందుకు కాంగ్రెస్ పన్నాగాలు పన్నింది. ఈ నెల 8న 8మంది కౌన్సిలర్లు చైర్మన్‌కు వ్యతిరేకంగా లేఖ అందించారు. దీంతో ఈ నెల 27న అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. గురువారం కౌన్సిలర్లు నోటీసులను అందుకున్నారు. ఇక్కడ మొత్తం 12మంది కౌన్సిలర్లు ఉన్నారు. 9మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, బీజేపీ నుంచి ఒకరు గెలిచారు. కాంగ్రెస్ కౌన్సిలర్ ఒకరు విజయం సాధించగా, ఇండిపెండెంట్‌గా గెలిచిన కౌన్సిలర్ కాంగ్రెస్‌లో చేరారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే



వివిధ శాఖల అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జనవరి 11 : రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్లు అభివృద్ధికి సూచిక వంటివని, అలాంటి రోడ్ల మీద ప్రమాదాల నివారణ, ప్రమాదాల తగ్గింపునకు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీలో ఉన్న శాఖలు సమన్వయంతో పని చేయాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చూడాలని, ప్రమాదాలు జరిగే ముఖ్య ప్రదేశాలలో ప్రమాద సూచికలు, మలుపుల వద్ద స్పీడ్ లిమిట్స్ సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. నేషనల్ హైవేపై గల ఆంథోల్ మైసమ్మ గుడి, ఖైతాపూర్, ఎల్లగిరి, లక్కారం, ధర్మోజిగూడెం, చౌటుప్పల్ ప్రదేశాల్లో సైన్ బోర్డ్సు, వేగ నియంత్రణ, ప్రమాద సూచికలు, లైటింగ్, బ్లింకర్స్ తదితర భద్రతా చర్యలు తీసుకోవాలని, వంగపల్లి అండర్ పాస్ వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎయిమ్స్ వద్ద వచ్చే జూన్ వరకు పూర్తయ్యే ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణం జరిగే సమయాల్లో ముందుగానే ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని, ప్రతినెలా జరిగే రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో తీసుకున్న చర్యలపై ప్రగతి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కమిటీ సమావేశంలో మెంబర్ కమ్ సెక్రటరీ, రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శంకరయ్య, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కె.శివరామిరెడ్డి, ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం.ప్రభాకర్‌రెడ్డి, రోడ్ సేఫ్టీ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఎస్ఎన్ జావిద్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పరిపూర్ణాచారి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎన్.వెంకటేశ్వర్లు, మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్ అహ్మద్, చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ ఎస్.భాస్కర్‌రెడ్డి, ఎన్‌హెచ్‌ఏ మేనేజరు జీఎల్ నవకాంత్, అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్, జీఎంఆర్ టోల్ మేనేజర్ ఎం.సతీశ్‌కుమార్, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

## గండి చెరువుకు మల్లన్నసాగర్ జలాలు

- నేటి ఉదయం కొడకండ్ల వద్ద నీటి విడుదల

యాదగిరిగుట్ట, జనవరి 11 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కొండకింద నిర్మించిన గండి చెరువులోకి కొమురవెల్లి మల్లన్నసాగర్ జలాలు రానున్నాయి. నేడు ఉదయం 8:30 గంటలకు సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేయనున్నారు. శుక్రవారం నుంచి 18వ తేదీ వరకు జలాలు గ్రావిటీ ద్వారా గండి చెరువులోకి రానున్నాయి. ఈ మేరకు గురువారం జగదేవ్‌పూర్ ఇరిగేషన్ సబ్ డివిజన్–2 డీఈఈ శైలేందర్ పత్రిక ప్రకటన విడుదల చేశారు. కొమురవెల్లి మల్లన్నసాగర్ జలాశయంలోని జలాలను గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో నిర్మించిన కాళేశ్వరం 15వ ప్యాకేజీలోని ప్రధాన కాల్వ వద్దకు చేరుకోనున్నాయి. అక్కడి నుంచి జిల్లాలోని తుర్కపల్లి మండలం ముల్కలపల్లి వద్ద నుంచి కాళేశ్వరం 16వ ప్యాకేజీ ప్రధాన కాల్వలోకి చేరుకుంటాయి. ప్రధాన కాల్వ 8వ కిలో మీటర్ వద్ద గండి చెరువుకు నీళ్లను విడుదల చేసేందుకు ప్రత్యేక బ్రాంచ్ కెనాల్, తూము నిర్మించారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా లక్ష్మీనరసింహ స్వామి కొండకింద గల గండి చెరువులోకి నీళ్లు చేరుకోనున్నాయి. ప్రధాన కాల్వ పక్కన గల వీరారెడ్డిపల్లి, కోనాపూర్, ఎన్‌జీబండల్‌తండా, తుర్కపల్లి(ఎం), ఇబ్రహీంపూర్, మంచిరోని మామిళ్ల, ముల్కలపల్లి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చూడాలని ఇరిగేషన్ అధికారులు కోరారు. కాగా లక్ష్మీనరసింహ స్వామి చెంతకు కాళేశ్వరం జలాలు మొదటిసారిగా 2022లోనే వచ్చాయి. 15వ ప్యాకేజీ ప్రారంభమైన సిద్దిపేట జిల్లా కొడగండ్ల రెగ్యులేటర్ నుంచి సుమారు 150 క్యూసెక్కుల నీటిని మాజీ మంత్రి హరీశ్‌రావు విడుదల చేయగా, తాజాగా రెండోసారి మల్లన్నసాగర్ జలాలు స్వామివారి చెంతకు చేరబోతున్నాయి.